



ఆఫీసులో పనిచేసే ఆడవాళ్ళను గురించి అంత చులకనగా మాట్లాడటం అలవాటయిపోయిందనుకుంటాము. మళ్ళా మన మందరం గ్రాడ్యుయేట్లమే. తప్పనిసరయి గడప దాటి బయటి కొచ్చిన ఆడది అందరి నోళ్ళలోనూ ఇలా నలగాల్సిందేనా!

పోనీ ఆ వాగే వాడయినా తాను శుచిగా ఉన్నాడేమో చూసుకున్నాడా!

ప్రతివాడూ గోరికాడ నక్కలా ఆ ఆడదాని శీలాన్ని అపహరించే అవకాశంకోసం ఎదురుచూసే మొనగాడే! అవకాశం దొరకని నాడు అసంతృప్తితో రెచ్చిపోయి, మరిన్ని కట్టు కథలు కల్పించి ప్రచారం చేసి అమాయకురాలైన ఆ ఆడపిల్ల బతుకును నరకప్రాయం చేస్తుంటాడు.

ఇదీ నేటి కథ...

• • •

కుసుమ మా ఆఫీసులో ఏకైక లేడీ స్టెనో పిస్టు. సహజంగా మగ మహారాజుల కళ్ళన్నీ ఆవిడ మీదే.

పొద్దున పదింటికి ఆఫీసు కొచ్చింది మొదలు సాయంత్రం అయిదింటికి ఆఫీ సొదిలిపోయేదాకా ఆమె కనుసన్నలలో పడాలని కొందరి తాపత్రయమైతే, ఆమెతో మాటలు కలపాలని మరి కొందరి తహతహ. ఇంకొంతమంది ధైర్యవంతులైతే ప్రర్శామణానుభవానికే తంటాలు పడటం కూడా కద్దు. మరి వీళ్ళందరికి ఇళ్ళ దగ్గర పెళ్ళాలున్నారు. మళ్ళీ వాళ్ళుమాత్రం శుచిగానే ఉండాలి! ఆఫీసుల కొచ్చి పనిచేస్తున్న పాపానికి మాత్రం పాపం, ఆ ఆడపిల్ల అందరికీ కావాలి. అందరి దృష్టిలో అంగడి బొమ్మ!

కుసుమది నా ప్రక్క డిపార్ట్‌మెంట్. అడపా దడపా మాటలు నడవటం తప్పనిసరి. అందుచేత ఆవిడ తత్వం అంతో, ఇంతో నాకు అర్థమయిందనే చెప్పాలి.

కుసుమ తండ్రి మిల్క్ ఫాక్టరీ ఉద్యోగి ఒకప్పుడు ఏక్సిడెంట్‌లో కాలు విరిగిపోయి ఉద్యోగం పూడగొట్టుకొని ఇంట్లో ఉండిపోవాల్సి వచ్చింది. చదువు సంధ్యలు లేని తల్లికి ఉద్యోగం రాలేదు. పెద్ద కూతురు కుసుమే ఇప్పుడు ఆ ఇంటికి జీవనాధారం. సామాన్యంగా ఉద్యోగాలకొచ్చే ఆడపిల్లల జీవితాలు ఇలాగే ఉంటుంటాయి. తప్పనిసరయితేగాని వాళ్ళు ఈ ఉద్యోగాలకి రారు. మనం మాత్రం వాళ్ళేదో జల్సా చేయటానికి సరదాగా ఈ జాబ్ చేస్తున్నారని అపోహలో ఉంటాం. ఆ మాటకొస్తే మగవాళ్ళలో మాత్రం సరదాగా ఉద్యోగాలు చేసేవాళ్ళు ఎంతమంది లేరు! వాళ్ళ సంగతి ఎవరూ పట్టించుకోరేం?

ఆఫీసు కొచ్చిన కొత్తల్లో కుసుమ చాలా ముభావంగా ఉండేది. బహుశా కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టిన మానసిక స్థితేమో తెలీదు. ఎవరితోనూ మాట్లాడేది కాదు. ఎవరన్నా ఏమన్నా అడిగితే అంతవరకే సమాధానం చెప్పి వూరుకొనేది. ఒక రోజు మానేజరు లోపలికి పిలిచి వార్నింగిచ్చాడు కూడా.

"మీ రిలా మన్ను తిన్న పాములాగా ఉంటే బిజినెస్ దెబ్బ తింటుంది. కౌంటర్‌లో ఉన్నప్పుడు హుషారుగా ఉండాలి. మన అనాసక్తి చూసి మన దగ్గరి కొచ్చే వాళ్ళు కూడా రావడం మానేస్తారు. బెస్ట్ ట్రై టు ఇంప్రూవ్ యువర్ ఇంటరెస్ట్."

ఆ సందర్భంలో నేనూ అన్నాను. "కుసుమగారూ! మేనేజర్ బిజినెస్‌కోసం చెప్పా డనుకోండి. నేను మీకోసం చెబుతున్నాను...అడక్కపోయినా! మీ రిలా ఉదయం పది నుండి సాయంత్రం అయిదు వరకు అంత నిశ్శబ్దంగా మీ పని చేసుకో గలుగుతున్నారు. నాకైతే పిచ్చెత్తి పోయేది సుమండీ!"

"నా కలవాటే కదండీ!" అంది కుసుమ.

"నే నొప్పుకోను. మీ రిలా ముభావంగా ఉంటూ మిమ్మల్ని మీరు వెలివేసుకోవడం వల్ల స్టాఫ్‌తో అనవసరంగా మాటలు పడాల్సి వస్తుంది."

"నేనూ విన్నాను. నే నొట్టి గర్విష్టి నని, రంభనని అహంకారమని అనుకుంటుండగా విన్నాను. కాని నా పరిస్థితి వీళ్ళ కెవరికీ అర్థం కాదు" అని కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

నే నన్నాను:"ఇవన్నీ ఈజీగా తీసుకోవాలి. మగవాళ్ళ మధ్య కొచ్చి పనిచేస్తున్నప్పుడు మీరు కాస్త సోషల్‌గా మూవయితే ఈ మాటలు రావనుకొంటా."

నా సలహో, మానేజరు వార్నింగు కుసుమ మీద కొద్దిగా పనిచేసింది. క్రమక్రమంగా ప్రపంచంలోకి రావటం మొదలు పెట్టింది.

అదే మొదలు...ప్రతివాడూ ఆవిడ ప్రపంచంలోకి జొరబడటానికి తంటాలు పడటం.

ఆవిడ డిపార్ట్‌మెంట్ సూపర్వైజరు— వయసు అయిదు పదులకు రెండు తక్కువ. పేరు వీరభద్ర రావు. ఎవరూ లేని సమయంలో ఆవిడను ప్రాధేయ పడ్డాడట—తన భార్య ఏడేళ్ళుగా మంచం మీద

## కె. హనుమంతరావు


తీసుకుంటూందని, తనకు సంసార సుఖం కరవయిం దని, దయ చూపించమని.

సహజంగానే కుసుమ నిరాకరించింది. ఈ విషయం నా కెట్లా తెలుసని అనుమానమా!

చాలా విషయాలు ఆవిడ నాకు చెప్పడం అందుకు కారణం.

కో—క్లర్క్ విశ్వేశ్వరరావు—వీడు వట్టి దగుల్బాజీ నాటకాలాడతాడు కూడా. నాటకాల్లో పాత్రలకు మల్లేనే మాట్లాడతాడు. కుసుమకు వల విసిరాడు. ఆ అమ్మాయి వయసు చాపల్యం వల్ల చలించిందేమో తెలీదు. పై మెరుగులకు ప్రలోభ పడింది. కొంతకాలం ఇద్దరూ సినిమాలకూ, పార్కులకూ తిరిగినట్లు వినికిడి. ఇంతలో ఏమయిందో ఏమో చెప్పా పెట్టకుండా నాటకాలరాయుడు ట్రాన్స్‌ఫర్ చేయించుకొని వెళ్ళిపోయాడు. కారణం తరవాత తెలిసింది—కుసుమ చెప్పగా. 'పెళ్ళి చేసుకుందా'మని ఈవిడ తెగించి అడిగితే 'ట్రాష్! నా కిదివరకే అయింది' అని చెప్పా డట. మరి పెళ్ళయిన ఆ మహానుభావుడు ఏం చేద్దామని ఈవిడ వెంట పడ్డాడో!

మొదటి అనుభవం కొట్టిన ఎదురు దెబ్బకు దిమ్మెర పోయి నట్టుంది. కొంతకాలం మనుషుల్లో పడలేక పోయింది కుసుమ. ఉద్యోగం కూడా వూడే పరిస్థితి వచ్చే సరికి తనను తాను సర్దుకొని, తిరిగి వచ్చి డ్యూటీలో చేరింది. అయితే ఈసారి అనుభవం నేర్పిన గుణపాటం వల్ల మరింత జాగ్రత్త పడి




నట్టుంది. పూర్వమంత సోషల్‌గా ఉండటం మానేసింది.

అయినా జనా లూరు కుంటారా!


కొత్తగా ప్రమోటయి ఆఫీసరుగా వచ్చిన హరిబాబు వేధించుకు తినడం మొదలు పెట్టాడట. ఒకరోజు ఫైల్లో లవ్ లెటర్ పెట్టి ఆ అమ్మాయికి అందించాడు. ఆ అమ్మాయి అది తిన్నగా నా దగ్గ రికే తీసుకొచ్చి సలహా అడిగింది.


"తొందర పడవద్దు.. నేను వాకబు చేస్తాను." అని చెప్పాను.

ఆదేం ఖర్మమో! ఆ మహాను భావుడికీ అంతకు ముందే పెళ్ళయింది. భార్య పూనాలో చదువు కొంటూందిట. ఆ విషయం దాచిపెట్టి కానీ కట్నం లేకుండా ఆదర్శ వివాహం చేసుకుంటానని వెంట బడ్డాడు. చేసేది లేక కుసుమ ఆ 'లవ్ లెటర్' హెడ్డాఫీసుకు పంపి రివర్షన్ ఇప్పిస్తానని బెదిరిస్తే గాని హరిబాబుగారి 'ఆదర్శ పిచ్చి' తగ్గ లేదు.

ఆఫీసులో సబ్—స్టాఫ్ వెంకట్రావు— నిండా ఇరవయ్యేళ్ళు లేవు. వాడికీ కావాల్సి వచ్చింది. కుసుమ పొందు . అయితే ఇతనిది కొత్త బాణీ. కుసుమ దారి కాచి బంగళా మలుపులో బలవంతం చేయ బోయాడట. సమయానికి ఎవరో అటు రావటంతో కుసుమ క్షేమంగానే బయట పడింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నెన్నో ఉన్నాయి. మీకు వినుగు పుట్టచ్చు. . అసలు ఇంతకనా నేను చెప్పొచ్చే దేమిటంటే

తమ లాగే కుటుంబ పోషణ కోసం పని చేసు కుంటున్న ఆడపిల్లను ఆడదయిన నేరానికి వేటా





ఒక్కళ్లాగా వెంటబడ, చిత్రహింస చేస్తున్నారే!

తమకు అందలేదన్న ఉక్రోషం కొద్దీ కట్టు కథలు అల్లి ప్రచారం చేస్తూ ఆ ఆడపిల్లల జీవితాల్లో నిప్పులు కుమ్మరిస్తున్నారే!

ఈ నాటకంలోని పాత్రలు ఒక్కసారి ఆత్మ విమర్శ చేసుకొంటే ఎంత బాగుణ్ను! ఉహూ... అలా ఎందుకు జరుగుతుంది? అది మగవాడి నైజం! ఇది ఆడదాని బలహీనత!.

ఇన్ని గండాలనూ తప్పించుకొని కుసుమ పెళ్ళి చేసుకోగలిగింది. ఎవర్నో కాదు, నా మిత్రుడు రాజశేఖరాన్ని. నా ప్రోద్బలం మీదే శేఖర్, కుసుమల పెళ్ళి జరిగింది వివాహానికి ముందు కుసుమ పూర్వ చరిత్ర మొత్తం శేఖర్‌కు నేనే చెప్పాను అంతా విని,'ఇట్సాల్ రైట్' అని నవ్వి కుసుమ మెళ్ళో తాళి కట్టేశాడు. కేవలం తను నమ్మిన తన ఆదర్శం కోసం నా జీవితంలో నేను నిజంగా గర్వించే విషయాల్లో శేఖర్ స్నేహం ఒకటి . అంత నిజాయితీపరుడు నాకు మిత్రుడు కావటం.. .

శేఖర్ ఒక మెడికల్ కంపెనీ రిప్రజెంటేటివ్.

కుసుమ, శేఖర్‌ల దాంపత్యం సజావుగా సాగుతున్న సమయంలోనే దురదృష్టం కొద్దీ ఈ సంఘటన జరిగింది.

ఆ రోజు ఆఫీసులో మందు పార్టీ హరిబాబు ట్రాన్స్‌ఫర్ సందర్భంగా ఏర్పాటయింది. ఈ రోజుల్లో మందు పార్టీ ఫాషన్. కల్చర్‌కి చిహ్నం. ఇష్టమున్నా, లేక పోయినా ఈ బలవంతపు బ్రాహ్మణార్థానికి వెళ్ళక తప్పదు. విషయం పసిగట్టి కుసుమ ఆ రోజు సెలవు పెట్టేసింది. పని ఉండి సెలవు పెట్టి పార్టీకి రాకపోతే అందరూ దుయ్యబడతారనే భయం కొద్దీ నేను వెళ్ళాను.

పది గంటలు దాటిన తరవాత తాగుడుతో పాటు వాగుడు ఆరంభమయింది.

"విశ్వేశ్వరరావు ఉంటే ఎంత బాగుణ్ను, గురూ! అని వాపోయాడో మిత్రుడు. విశ్వేశ్వరరావు తాగటంలో ఎక్స్‌పర్ట్. తాగి వాగటంలో స్పెషలిస్టు. ఆ విద్య ఇప్పుడు హరిబాబుకు వంట బట్టినట్టుంది. ఇంకేం? విశ్వేశ్వరరావు బ్రదర్స్! మన కుసుమాయమ్మ పుణ్యమా అని మతి పోగొట్టుకుని దేవదాసయి పోయాడటగదా!"

"తప్పు దాన్ది కాదు. అది దాని వృత్తి. బోగల్ లంజ. దాన్ని నమ్మమం దెవరు? నాకూ లైన్ చేసింది. తొందర్లోనే జ్ఞానోదయమైంది కాబట్టి మీ ముందు ఇలా మందు కొట్ట గలుగుతున్నా" అని నవ్వాడు వీరభద్రరావు. ఎవరూ నమ్మలేదు. ఆ సంగతి వాడికీ తెలుసు. అందుకు మరీ గట్టిగా అన్నాడు..

"మీ రెవర్నూ నమ్మరు! నాకు తెలుసు. నాకూ నమ్మకం చిక్కలేదు. ఒక నైట్ నా గదికొచ్చి కాళ్ళ మీద పడింది భోరున ఏడుస్తూ. కారణమేమిటన్నాను? మెళ్ళో తాళి కట్టి కాపాడమంది. ఎందుకూ అన్నాను. తనకు కడుపయ్యిందని, చేసిన వాడు చెయ్యిచ్చాడని తండ్రిలాంటి వారు మీరు ఆదుకోవాలని... బిగ్గరగా నవ్వాడు వీరభద్రరావు.

"ఇంతకీ ఎవరంటారు వాడు " అడిగాడు వెంకట్రావు.

"నాకేం తెలుస్తుందోయ్! నీకేమైనా తెలుసా హరిబాబూ. అని నావంక తిరిగాడు వీరభద్రం.

ఆ అన్నది నన్నేనని తెలుస్తూనే ఉంది. ఆభాసం పాలౌతుందేమోనని కోపాన్ని అదిమిపట్టి ఉంచాను.

వీరభద్రం వూరుకోలేదు.

"మరీ అంత మూగిలాగా కూర్చో నక్కర్లేదు ఇది మందు పార్టీ. నీవు మహా రచయితవు. నీరచనల ద్వారా నీ ప్రియురాలిని ఆకట్టుకున్న నైనం వివరించరా! ఏమైనా నీ తెలివి తేటలకు నా జోహార్లు, బాబూ! కన్నెపిల్లకు కడుపు చేసి, తెలివిగా స్నేహితుడికి బట్వాడా చేయటమనే విద్య ఉన్నదే, అది నీ దగ్గరే నేర్చుకోవాలి మిత్రమా."

తన జోకుకు తనే నవ్వుకుంటున్న వీరభద్రం ముఖం ఫెడీలు మంది నా చేతిలోని మందు గ్లాసు దెబ్బకు.

రెచ్చిపోయిన వీరభద్రం వాగుతున్నాడు. "నన్ను కొడతావ్రట్రా, రాస్కెల్! ఉన్న మాటంటే నీకంత ఉక్రోషం వచ్చిందా! శేఖర్‌గాడి చాటున నీవూ, ఆ రంకు ముండా ఆడే భాగవతం ఎవరికి తెలీదనిరా!"

అంతే! నేనేం చేస్తున్నానో నాకే తెలీదు. అమాంతం వెళ్ళి వాడి గొంతు పట్టుకొన్నాను.

వీరభద్రం తను చేసిన తప్పుకు ఏ లోకంలో శిక్ష అనుభవిస్తున్నాడో తెలీదు. నేను చేసిన తప్పుకు నేను మూడు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించి బయట కొచ్చాను.

ఈ మూడు సంవత్సరాల్లో లోకం ఏమీ మారలేదు—నా ఉద్యోగం వూడడం, కుసుమ జాబ్‌కి రిజైన్ చేయడం, శేఖర్ మళ్ళీ పెళ్ళిచేసుకోవడం తప్ప.'

ఒక రోజు కాకతాళీయంగా కుసుమ ఎదురు పడింది. తను తప్పించుకోవటానికి ప్రయత్నించినా నేనే పలకరించాను. అప్పుడు అంది: "మీరూ అందరిలాంటి మగవాళ్లే! మీకైతే మీరే నాకు, శేఖర్‌కి పెళ్ళి జరిపించి, పెళ్ళయిన ఆడదాన్ని గురించి అంత అభాండాలేస్తారా! మీకు తెలీదూ నే నెలాంటి దాన్నో!"

నా కర్థం కాలేదు. అదే అన్నాను.

"ఇంకా ఎందుకండీ నటన! ఆ రోజు మందు పార్టీలో మీరు వీరభద్రాన్ని చంపెందెందుకు? పాపం, పెద్దాయన! మీరు 'చెత్త' వాగుతుంటే అడ్డం పడ్డందుకే గదా!"

స్టేటుమెంటా ఒకటైనా నాకు వ్యతిరేకంగా కోర్టులో ఇచ్చిన సాక్ష్యాన్ని ఆఖరికి 'కుసుమ కూడా నమ్మిందన్న మాట!

"శేఖర్ నాకు విడాకులిచ్చి మళ్ళీ పెళ్ళి చేసుకొన్నాడు మీ పుణ్యమా అని." నా జీవితంలోకి మళ్ళీ జొరబడి నాకే మాత్రం సుఖం కూడా లేకుండా చేయకండి. ప్లీజ్! అంటూ విసవిసా నడుచుకుంటూ వెళ్ళి పోయింది కుసుమ. ★

నీటికోసం ....

చిత్రం :— నానిబాబు

